సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 26 । మే । 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీ టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికింది. కనిష్టం రూ.15 వేలు, సరాసరి రూ.23 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



తమిళుల సాంస్కృతిక వైభవం

తమిళనాడు ప్రాంత భక్తులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలతో తమ వైభవాన్ని చాటి చెప్పారు. సత్యసాయి సమాధి చెంత సంగీత కచేరి నిర్వహించారు. 8లో

గరిష్టం/కనిష్టం

34.3°/21.7°

జిల్లా పరిధిలో శనివారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై కొన్ని మండలాల్లో తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఖాద్రీశా.. కరుణించు స్వామీ!



భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీ ఆలయం

కదిరి టౌన్‌: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలు, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఖాద్రీశా తమను చల్లగా చూడు స్వామీ అంటూ వేడుకున్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం



పుట్టపర్తి: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యాన పంటలు సాగు చేసుకునే రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు అందించనున్నట్లు ఏపీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పండ్ల మొక్కలు అందించటంతో పాటు మూడేళ్లపాటు వాటి నిర్వహణ కోసం రైతుకు డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. మామిడి, చీనీ, జీడి మామిడి, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, రేగు, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు గులాబీ, మల్లె పూల తోటల పెంపకానికి ఈ పథకం కింద ప్రోత్సాహకాలందిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సజావుగా 'సప్లిమెంటరీ' పరీక్షలు

పుట్టపర్తి: జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు రెండోరోజు శనివారం సజావుగా జరిగాయని విద్యాశాఖాధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని డీవీఈఓ రఘునాథరెడ్డి, డీఈఓ మీనాక్షి తెలిపారు.

బతుకులతో 'బంతాట'

- ధర్మవరానికి చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై అధిక వడ్డీకి అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక అవమానాలు భరించలేక ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి పెద్ద మరణంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది.
- పుట్టపర్తికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆన్‌లైన్ క్రికెట్ యాప్‌లలో బెట్టింగ్ ఆడుతూ భారీగా అప్పులు చేశాడు. బెట్టింగ్‌లో పోగొట్టుకోవడమే తప్ప రాబడి లేక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఉద్యోగం వదిలి ఎటో వెళ్లిపోయాడు.
- ముదిగుబ్బకు చెందిన అబ్బాయి తమిళనాడులోని ఓ ప్రముఖ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. అక్కడ క్రికెట్‌పై భారీగా పందేలు వేశాడు. తల్లిదండ్రుల ద్వారా తెప్పించుకున్న రూ.2 లక్షల నగదులో యూనివర్సిటీ ఫీజు కట్టకపోగా.. బయటి వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

ఇవన్నీ మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. క్రికెట్ బెట్టింగ్ మాఫియా కోరల్లో చిక్కుకుని పలువురి జీవితాలు ఛిద్రమౌతున్నాయి. ఐపీఎల్ ట్వంటీ 20 క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగులు వేసి ఎంతోమంది డబ్బు పోగొట్టుకుని అప్పుల అగాథంలో కూరుకుపోతున్నారు.



- యువత భవితను చిదిమేస్తున్న క్రికెట్ బెట్టింగ్
- డబ్బులు కొల్లగొడుతున్న ఆన్‌లైన్ యాప్‌లు
- నేడు ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌పై రూ.కోట్లల్లో పందేలు !

ధర్మవరం: ఐపీఎల్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నేపథ్యంలో బెట్టింగ్ జోరందుకుంది. జిల్లాలోని ధర్మవరం, కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర తదితర నియోజకవర్గాలలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. జట్టు గెలుపుపైనే కాకుండా వేసే బంతిలో వచ్చే పరుగులపైనా, వికెట్ పడుతుందా లేదా అన్న అంశాలపై కూడా పందేలు కాస్తున్నారు. ఆదివారం ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ తలపడుతున్నాయి. ఈ జట్ల గెలుపోటములపై క్రికెట్ అభిమానులు ఆఫ్‌లైన్ విధానంలో అయితే ఫోన్ల ద్వారా బెట్టింగ్ ఆడుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తెలుగువారి సెంటిమెంట్‌తో ముడిపడటంతో తెలుగు రాష్ట్రాల్లో రూ.కోట్లల్లో బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం.

ముంచేస్తున్న ఆన్‌లైన్ యాప్‌లు..

ఆన్‌లైన్‌లో 10 దాకా క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు ఉన్నాయి. ఇవి నిత్యం పేర్లు మార్చుకుంటూ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. తొలుత భారీగా ఆఫర్లు ప్రకటిస్తూ యువతను ఆకర్షిస్తారు. మెల్లగా వారి ముగ్గులో పడి బెట్టింగ్‌కు అలవాటు పడగానే డబ్బులు కొల్లగొడతారు. దీంతో యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోంది.

అవగాహన కల్పించినా మార్పు శూన్యం..

జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రతి నియోజకవర్గంలోనూ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, జూద కార్యకలాపాల వల్ల కలిగే నష్టాలను తరచూ వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా ఫలితం కానరావడం లేదు. అనధికారికంగా బెట్టింగ్‌లు నిర్వహించే యాప్‌లపై పోలీసులు కొరడా ఝుళిపించి నిషేధిస్తే తప్ప ఫలితం ఉండదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే బెండ్ తీస్తాం



జిల్లాలో బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. జూద కార్యకలాపాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపండి. వివరాలు గోప్యంగా ఉంచుతాం. – మాధవరెడ్డి, ఎస్పీ

నయనానందకరం.. పుష్పయాగోత్సవం

- ముగిసిన లక్ష్మీచెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు



అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు

ధర్మవరం అర్బన్: శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి పుష్పయాగోత్సవం నయనానందకరంగా సాగింది. ధర్మవరంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉదయం 9 గంటలకు ఉభయదారులు అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పోరాళ్ళ పుల్లయ్య కుటుంబ సభ్యులు 28 రకాల పుష్పాలను పురవీధుల్లో ఊరేగిస్తూ స్వామివారికి సమర్పించి పుష్పయాగం చేయించారు. బంతి, చామంతి, పారిజాతం, సంపంగి, సుగంధ, నీలాంబరి, కనకాంబరి, శ్రీకృష్ణ తులసి, రామ తులసి, గుండుమల్లి, సన్నజాజి, దవణం, గులాబీ తదితర పూలతో లక్ష్మీ చెన్నకేశవునికి పూజలు చేశారు. సహస్ర నామాలతో అన్నమయ్య సంకీర్తనలను అన్నమయ్య సేవా మండలి సభ్యులు ఆలపించారు. సాయంత్రం ఆరు గంటలకు శయనోత్సవం (ఏకాంత సేవ) కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం, అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు అప్రమత్తమైన పోలీస్

- హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు
- బాణసంచా, పెట్రోల్, డీజిల్ లూజు అమ్మకాలపై నిషేధం
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న కార్డన్ సెర్చ్‌లు
- అమలులో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్



తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తరహాలోనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా పోలీసు శాఖ అప్రమత్తమైంది. జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలు గుర్తించి స్థానిక పోలీస్ అధికారుల సమక్షంలో కార్డన్ సెర్చ్‌లు నిర్వహించింది. అనుమానిత వ్యక్తులతో పాటు రికార్డులు లేని వాహనాలను తమ ఆధీనంలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

సోషల్ మీడియాపై నిఘా..

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితర సోషల్ మీడియా ద్వారా వదంతులు, చట్ట వ్యతిరేక మెసేజ్‌లు, ఉద్రేకాలు, గొడవలు సృష్టించే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అలాంటి వారిని ముందస్తుగా గుర్తించి అనర్థాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఉండేలా గ్రామాల్లో సమావేశాలు, పల్లె నిద్రలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

బంక్ యజమానులకు పోటీసులు..

అరాచకశక్తులు పెట్రోల్, బాంబులు, పేలుడు స్వభావం కలిగిన బాణసంచా సామగ్రితో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్నందున పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలు చేయకూడదని పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బంక్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. బాణసంచాపై కూడా ఆంక్షలు విధిస్తూ తయారీదారులకు హెచ్చరికలు జారీ చేశారు.

ర్యాలీలు నిషేధం..

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదని, బాణసంచా కాల్చకూడదని ఆంక్షలు విధించారు. ఎక్కడా జనం గుంపులుగా గుమికూడరాదు.

గొడవలకు వెళ్లొద్దు..

ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) తరువాత గ్రామాల్లో ప్రజలు గొడవకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలి. శాంతిభద్రతలకు భంగం కలిగేవిధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు. ఇప్పటికే జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తనిఖీలు ముమ్మరం చేశాం. తనిఖీల్లో భాగంగా ఆర్‌సీ లేని ఆరు ద్విచక్రవాహనాలతో పాటు ఐదు వేటకొడవళ్లను సీజ్ చేశాం. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాం. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా, సమస్యలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. – మాధవరెడ్డి, ఎస్పీ

ఓట్ల లెక్కింపు పకడ్బందీగా సాగాలి

హిందూపురం: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పకడ్బందీగా సాగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం లేపాక్షిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, హిందూపురం బిట్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతా చర్యలను ఎస్పీ మాధవరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ సూచనలిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద నియోజకవర్గాల సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ హాలులోకి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదన్నారు. కంట్రోల్ రూమ్ తనిఖీచేసి ఈవీఎంల భద్రతను పరిశీలించారు. లేపాక్షి గురుకుల పాఠశాల డార్మెటరీ బ్లాక్, అలాగే బిట్ కళాశాల ఆవరణలో మీడియా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆర్‌ఓలను ఆదేశించారు. ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఆర్‌ఓలు భాగ్యరేఖ, వెంకటశివసాయి రెడ్డి, గౌరీశంకర్, డీఎస్పీలు, నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్

కౌంటింగ్ సిబ్బందికి విధుల కేటాయింపు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించినట్లు డీఆర్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఎన్‌ఐసీ కార్యాలయంలో మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ మొదటి విడతలో మొత్తం 915 మంది సిబ్బందికి విధులు కేటాయించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బందికి తహసీల్దార్ల ద్వారా నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐటీ నోడల్‌ఆఫీసర్ రామమోహన్‌రావు, నెట్‌వర్క్ ఇంజినీర్ విజయ్‌కుమార్, టెక్నికల్ అసోసియేట్ రవికృష్ణ, ఈడీఎం హరీష్‌కుమార్, టెక్నికల్ అసోసియేట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మళ్లీ చరిత్ర సృష్టించబోతున్నాం

- జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లూ గెలుస్తున్నాం
- టీడీపీ కార్యకర్తలను నిండా ముంచేందుకు ఆ పార్టీ జూదగాళ్ల కొత్త డ్రామా
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- బాబుకు దమ్ముంటే ఎన్ని సీట్లు గెలుస్తారో చెప్పాలి: ఎంపీ మాధవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ నేతలు

అనంతపురం ఎడ్యుకేషన్: 'రాష్ట్రంలో విశ్వసనీయత–మోసానికి మధ్య ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రజలు విశ్వసనీయతకే పట్టం కట్టారు. ఉమ్మడి జిల్లాలో ఈ సారి 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లూ గెలుస్తున్నాం. మళ్లీ చరిత్ర సృష్టించబోతున్నాం' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం నగర శివారులోని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూపురంలో బాలకృష్ణ చాప చుట్టేశారన్నారు. కుప్పంలో చంద్రబాబు, పిఠాపురంలో పవన్ కల్యాణ్ కూడా ఓడిపోతున్నారన్నారు. కేవలం నాలుగు సీట్లకు చంద్రబాబు పరిమితం కాబోతున్నాడన్నారు. జనసేన–బీజేపీ కలిసి మరో ఏడు సీట్లు గెలవబోతున్నాయన్నారు. 'సింహం విదేశాలకు వెళ్లింది, ఒకటో తేదీ దిగుతోంది. 4న జూలు విదిలించబోతోంది' అంటూ సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

టీడీపీ జూదగాళ్లను నమ్మొద్దు

వార్ ఇప్పటికే వన్‌సైడ్ అయితే, టీడీపీ జూదగాళ్లు మాత్రం కొత్త డ్రామాకు తెర తీశారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ గెలవబోతోందంటూ చోటా మోటా నాయకులకు ఆశలు కల్పించి వారితో అప్పులు చేయించి మరీ పందేలు కట్టిస్తున్నారని, మరోవైపు ఓడిపోతున్న ఆ పార్టీ అభ్యర్థులు మాత్రం వైఎస్సార్‌సీపీ తరఫున పందేలు కడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బు సంపాదించుకునేందుకు వారే వైఎస్సార్ సీపీ తరఫున పందేలు వేస్తున్నారన్నారు. నాయకుల మాటలు నమ్మి డబ్బు పోగొట్టుకోవద్దని, కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టొద్దని టీడీపీ కార్యకర్తలకు హితవు పలికారు. ఎన్నికల్లో కనీసం పోటీ ఇవ్వగలమనే ఆశతోనే చంద్రబాబు బీజేపీతో జత కట్టారన్నారు.

బాబూ.. ఎన్ని సీట్లు గెలుస్తావో చెప్పు?

ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ 152కు పైగా ఎమ్మెల్యే, 22కు పైగా ఎంపీ స్థానాలు గెలవబోతున్నామని సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రకటనతో టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు. చంద్రబాబుకు నిజంగా ప్రజల పట్ల విశ్వాసం ఉంటే ఎన్ని సీట్లు గెలుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబును నమ్మి అమాయకులైన చాలామంది కమ్మ వాళ్లు గత ఎన్నికల్లో పందేలు కాసి డబ్బు పోగొట్టుకున్నారన్నారు. కమ్మ కులానికి చంద్రబాబు చేటులాంటి వారన్నారు. రాజకీయ అజ్ఞాని అయిన తన కుమారుడు ఎక్కడ పత్తా లేకుండా పోతాడోననే భయంతో జనబలమున్న పలువురు కమ్మ యువతకు చంద్రబాబు టికెట్లు ఇవ్వలేదని ఆరోపించారు. పల్నాడులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దౌర్జన్యం చేస్తున్నాడంటున్న టీడీపీ నాయకులు ఎందుకు అక్కడ రీ పోలింగ్‌కు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. దీన్ని బట్టే టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందనే విషయం అర్థమైపోతోందన్నారు. జూన్ 4 తర్వాత జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు కావాలనే రెచ్చగొడుతున్నాయని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నసనకోట ముత్యాలు, జూటూరు శేఖర్, చిత్రా వెంకటేష్, నరసింహగౌడ్, కుంటిమద్ది రమేష్, పేరూరు మోహన్ పాల్గొన్నారు.

మడకశిరలో భారీ వర్షం

- జిల్లాలోని 18 మండలాల్లో వానలు
- పొంగిన వాగులు, వంకలు



మడకశిర మండలం దెయ్యాలచెరువులోకి చేరిన వర్షపునీరు



బుళ్లసముద్రం వద్ద వర్షానికి నిండిన చెక్ డ్యాం



మడకశిర మండలం జిల్లేడుగుంటలో కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి మడకశిరలో భారీ వర్షం కురిసింది. ఇక్కడ 72 మి.మీ. వర్షం కురవడంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యాములకు నీరు చేరింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలవాలాయి. రాత్రి 9 నుంచి శనివారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జిల్లేడుగుంటలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు ఎగిసిపడ్డాయి. కొన్ని చోట్ల ఈదురుగాలులకు షెడ్ల పైకప్పు రేకులు ఎగిరి పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా మడకశిర మండలం 72.2 మి.మీ, కనగానపల్లి 63.4, అమరాపురం 42.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక గుడిబండలో 37.8, ఓడీ చెరువు 26.2, అమడగూరు 25.4, రామగిరి 15.4, హిందూపురం 9.8, లేపాక్షి 9.6, చిలమత్తూరు 8.6, రొద్దం 8.2, గోరంట్లలో 7.2, తలుపుల, రొళ్లలో 5.4, పెనుకొండ 5, సీకే పల్లి 4.4, అగళి 4, ముదిగుబ్బ 1.8 మి.మీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

క్లుప్తంగా

మహిళా చెస్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు ప్రారంభం



చెస్‌లో తలపడుతున్న బాలికలు

హిందూపురం: స్పార్టాన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా చెస్ అసోసియేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సౌజన్యంతో పట్టణంలో రాష్ట్ర మహిళా చెస్ చాంపియన్‌షిప్-2024 ఎంపిక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 45 మంది క్రీడాకారిణులు పోటీల్లో పాల్గొన్నట్లు ఇంటర్నేషనల్ ఆర్బిటర్, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ విద్యాసాగర్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురంలో మొదటిసారిగా మహిళా చాపియన్‌షిప్ పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. టోర్నీ డైరెక్టర్ ఆరిఫుల్లాఖాన్‌ను అభినందించారు. పోటీల్లో ప్రతిభచూపిన టాప్-4 క్రీడాకారిణులను జాతీయ మహిళా చెస్ చాంపియన్‌షిప్-2024కు ఎంపిక చేస్తామని, వారు రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

గుంతకల్లుటౌన్: పట్టణంలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న స్థానిక ఉమామహేశ్వర్‌నగర్‌కు చెందిన నల్లబోతుల వాసు అనే దొంగను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపిన వివరాలు.. గతనెల 19న ప్రశాంతినగర్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో చోరీ జరిగింది. నల్లబోతుల వాసు ఈ చోరీ చేసినట్లు పోలీసులు నిర్ధారించుకుని అతడిపై నిఘా పెట్టారు. పక్కా సమాచారం మేరకు శనివారం ఉదయం హజరత్ మస్తానయ్య దర్గా వద్ద దొంగలించబడిన ఓ హోండా యాక్టివాపై వెళ్తున్న వాసును సీఐ, సిబ్బంది పట్టుకుని విచారించారు. రైల్వే క్వార్టర్స్‌తో పాటు అనంతపురం త్రీటౌన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అతడు అంగీకరించాడు. చోరీ చేసిన 1.91 గ్రాముల బంగారు నగలు, 28.55 గ్రాముల వెండి, హోండా యాక్టివా వాహనం, సామ్‌సంగ్ ఎల్ఈడీ టీవీ, సామ్‌సంగ్ ట్యాబ్, మిక్సీ, కొత్తదుస్తులను స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

‘సాగు’బాట

వర్షం రాకతో ముంగిళ్లు చల్లబడ్డాయి. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. మృగశిర కార్తె ప్రవేశంలోనే విత్తు వేసేందుకు పొలాలను దుక్కి చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వాతావరణ పరిస్థితులు కూడా రైతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని విధాలుగా సహకరిస్తుండడంతో ఈ ఖరీఫ్‌లో ఇప్పటికే పొలాల్లో వేసవి దుక్కులు ఊపందుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కమ్మూరు వద్ద ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న దృశ్యం



వరి ధాన్యం విత్తనాలను ఇంటికి తరలిస్తున్న రైతు





కట్టకిందపల్లిలో సేద్యం చేస్తున్న రైతు, నరసనాయునికుంటలో చీనీలో అంతర పంటగా వేరుశనగ విత్తుకు సేద్యం చేస్తున్న రైతు



పొలం పనులు ముగించుకుని ఇంటి దారి పట్టిన రైతన్న

టీబీ డ్యాంకు మొదలు కాని ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో ఇంకా మొదలుకాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఇదే సమయంలో అకాల వర్షాల కారణంగా అడపాదడపా జలాశయానికి వరద నీరు చేరింది. గతేడాది మే 7 నుంచి డ్యాంలో నీటి చేరిక మొదలై ఈ సమయానికి 1.035 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి వస్తుండగా 4.200 టీంఎంసీలు నిల్వ ఉండేది. అయితే ఈ ఏడాది ఇప్పటికీ ఇన్‌ఫ్లో జీరో ఉండగా నీటి నిల్వ 3.365 ఎంసీటీలుగా ఉంది. జలాశయం నుంచి అన్ని కాలువలకు నీటి విడుదలను నిలిపి వేసి కేవలం రాయబసవన కాలువకు 12 క్యూసెక్కుల నీటిని మాత్రమే వదులుతున్నారు. కొద్ది రోజులుగా నీటి నిల్వలో మార్పు కనబడకపోగా ఆవిరి రూపంలో నీటి మట్టం తగ్గుతోంది. శనివారం డ్యాంలో 1577.47 అడుగుల వద్ద 3.365 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ మొదటి వారం నుంచి జలాశయానికి నీటి చేరిక మొదలయ్యే అవకాశాలున్నట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

పులివెందుల రూరల్: పులివెందుల-కదిరి రోడ్డుపై కంపోస్టు యార్డు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా మద్దన్నగారిపల్లెకు చెందిన గుజ్జల పోతులయ్య అనే వ్యక్తి తన సొంత పనుల నిమిత్తం పులివెందులకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. కదిరిరోడ్డులోని కంపోస్టుయార్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గాలీవాన బీభత్సం



విద్యుత్ స్తంభాలు రోడ్డుపై పడిన దృశ్యం



పోలేనహళ్లిలో పడిపోయిన కోళ్లషెడ్డు

- పోలేనహళ్లిలో షెడ్డు కూలి 1,500 కోడి పిల్లల మృతి

పావగడ: తాలూకా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. తాలూకా లోని లింగదహళ్లి, సాసలకుంటె, మల్లమ్మనహళ్లి, పోలేనహళ్లి గ్రామాల ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభాలు కూలి పోయాయి. లింగదహళ్లి, సాసలకుంటె గ్రామాల్లో రైతులు వీరాంజనేయ, భద్రావతి అంజినప్ప, పాపన్నకు చెందిన తోటల్లో అధిక సంఖ్యలో వక్క చెట్లు నేల కూలాయి. కొన్ని వక్క చెట్లు రహదారిపై పడిపోవడంతో వాహన రాకపోకలు నిలిచి పోయాయి. కాగా మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం తో 150 వక్క తోటల్లో వందలాది వక్క చెట్లు నేల రాలి లక్షలాది రూపాయల ఆస్తి నష్టం తో అల్లాడిపోయిన అరసికెరె గ్రామం ఇంకా తేరుకోక ముందే సాసలకుంటె, పోలేనహళ్లి గ్రామాల్లో వరుణుడు మరో బీభత్సాన్ని సృష్టించాడు. శుక్రవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం రాత్రి 12 గంటల వరకు ఏకధాటిగా కురిసింది. దీంతో సాసలకుంటె గ్రామంలో వంకలు పారాయి. అయితే గాలి వాన దెబ్బకు పోలేనహళ్లిలో కోళ్లఫారం షెడ్డు రేకులు పూర్తిగా ఎగిరి పోయి షెడ్డు లో ఉన్న 1,500 కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి. రూ.లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోళ్ల షెడ్డు యజమాని ఈశ్వర్ కోరాడు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెల గ్రామ సమీపంలో పోలీసులు కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. వివరాలు.. శుక్రవారం రాత్రి పోలీసులు కర్ణాటక సరిహద్దులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా పోలీసులను చూసి రెండు ద్విచక్రవాహనాలపై కర్ణాటక మద్యం తరలిస్తున్న వారు అక్కడి నుంచి పారిపోయారు. అయితే అందులో ఒకరిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితుడు మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన గుజ్జల గంగయ్యగా గుర్తించారు. ఈసందర్భంగా రెండు ద్విచక్రవాహనాలతోపాటు 1,080 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడిపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



పట్టుబడిన ద్విచక్రవాహనం, కర్ణాటక మద్యం

హమాలీ మృతి

బుక్కరాయసముద్రం: స్థానిక హమాలీ కాలనీ సమీపంలోని బర్దన్ కాలనీ వద్ద ఓ హమాలీ బ్రిడ్జిపై నుంచి కాలువలోకి పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బీకేఎస్ పంచాయతీ పరిధిలోని బర్దన్ కాలనీలో నివాసం ఉంటున్న నాగరాజు(58) నగరంలో హమాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాగరాజు శుక్రవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా బర్దన్ కాలనీ సమీపంలో హెచ్ఎల్‌సీ కెనాల్ బ్రిడ్జిపై నుంచి దాటుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు.

వసతిగృహ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతిగృహాల్లో 2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించి 3 వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈమేరకు ఆ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న బాలుర వసతి గృహంలో 100 సీట్లు, అరవింద్ నగర్‌లో ఉన్న బాలికల వసతిగృహంలో 50 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9177766540, 94927760438 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైలులో వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వే స్టేషన్‌లో హిందూపురం- యశ్వంతపూర్ ప్యాసింజర్ రైలులో శనివారం ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బాలజీనాయక్ తెలిపారు. ఉదయం 8 గంటల సమయంలో రైలు తనిఖీ చేస్తుండగా వ్యక్తి మృతదేహం కనిపించిందన్నారు. మృతదేహం వద్ద ఉన్న టికెట్, ఇతర చీటీల ఆధారంగా మృతుడు బీజాపూర్‌కు చెందిన సంతోష్(40)గా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. సంతోష్‌ది సహజ మరణంగానే భావిస్తున్నామని, ఈ మేరకు మృతుడి బంధువులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర రైల్వే దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

ధర్మవరం అర్బన్: అంతర్రాష్ట్ర రైల్వే దొంగను ధర్మవరం రైల్వే పోలీసులు పట్టుకున్నారు. స్థానిక రైల్వే పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం సీఐ నాగరాజు వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా యాదగిరిటౌన్‌కు చెందిన సాంబన్న రైళ్లలో దొంగతనాలకు పాల్పడేవాడు. రైళ్లలో విలువైన వస్తువులను తీసుకెళుతున్న ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు తెగబడేవాడు. ప్రయాణికుల వద్దనున్న విలువైన సెల్‌ఫోన్లు, వస్తువులు దొంగతనం చేసి వాటిని అమ్మి సొమ్ము చేసుకునేవాడు. ఈక్రమంలో ధర్మవరం రైల్వే పరిధిలో రెండు దొంగతనాలు చేశాడు. రైలులో తిరుగుతున్న సాంబన్నను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి



చంద్రాయప్ప (ఫైల్)

లేపాక్షి: మానేపల్లికి చెందిన శతాధిక వృద్ధుడు భట్టికర చంద్రాయప్ప (101) శనివారం సాయంత్రం మృతి చెందారు. 1923లో భట్టికర చంద్రాయప్ప మానేపల్లిలో జన్మించారు. 18 ఏళ్ల వయసులో మహాత్మాగాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. గాంధీజీ హిందూపురంలో స్వాతంత్ర్య ఉద్యమ పర్యటనకు వచ్చినపుడు వెళ్లి చూసినట్లు ఆయన తరుచూ చెబుతుండేవారు. వందేళ్లు పూర్తి చేసుకున్నందుకు మానేపల్లి గ్రామ సచివాలయం నందు గతేడాది ఆయన్ను సన్మానించారు. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించినపుడు చంద్రాయప్ప తన మిత్రులతో కలిసి గ్రామంలో పెద్ద ఎత్తున సంబరాలు జరిపినందుకు గుర్తుగా ఒక రాతి దిమ్మె శాసనాన్ని కూడా గ్రామ సచివాలయం ముందు ఏర్పాటు చేశారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని బంధువులు పేర్కొన్నారు.

తమిళుల సాంస్కృతిక వైభవం



చిన్నారుల కురవంజి నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: తమిళనాడు ప్రాంత భక్తులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలతో తమ వైభవాన్ని చాటి చెప్పారు. పర్తి యాత్రలో భాగంగా పడమటి, వాయువ్య చెన్నై, తిరువళ్లూరు ప్రాంతాలకు చెందిన సత్యసాయి భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. శనివారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత చెన్నై సత్యసాయి భక్తులు సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో వారు ఆహూతులను మైమరపింపజేశారు. సాయంత్రం తమిళనాడు ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ సన్యాసి వళ్లలార్ జీవిత గాథ, పరమత సహనం పట్ల ప్రజలను చైతన్య వంతులను చేసిన విధానాన్ని వివరిస్తూ వళ్లలార్ సన్యాసి పేరుతో బాలవికాస్ విద్యార్థులు చక్కటి నాటిక ప్రదర్శించారు.18వ శతాబ్దంలో అయన భారతీయ సమాజంలో నెలకొన్న కుల,మతాంతరాలను తొలగించేందుకు చేసిన కృషిని చక్కగా వివరించారు. తర్వాత కురవంజి పేరుతో బాలవికాస్ చిన్నారుల నృత్య ప్రదర్శనతో అలరించారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు



వళ్లలార్ నాటికలోని ఓ సన్నివేశం